# జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి దామోదర్ రాజనర్సింహ తనిఖీ



జోగిపేటలో ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, జనవరి 05, ప్రభాతవార్త:**
అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో శుక్రవారం సాయంత్రం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి పర్యటించి రెవెన్యూ అతిథిగృహం, రైతుబజార్‌లను పరిశీలించటంతోపాటు పక్కనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ భవనం అద్దెభవనంలో కొనసాగుతుండటంతో దీనికి నూతన భవనం నిర్మించాలనే ఉద్దేశంతో స్థల పరిశీలన చేశారు. భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆర్డీవో పాండును ఆదేశించారు. ఇకపోతే రైతుబజార్ నిరుపయోగంగా ఉండటంతో, అవసరమైన చర్యలు తీసుకొని ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అనంతరం జోగిపేటలోని వంద పడకల ఆసుపత్రిని తనిఖీ చేసి ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రికి అవసరమయ్యే సిసి రోడ్డు, ప్రహరీగోడ, పోస్టుమార్టం భవనం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఆయనవెంట జిల్లా వైద్యాధికారి సంగారెడ్డి, జోగిపేట ఆసుపత్రి సూపరిండెంట్ రమేష్, డాక్టర్ వీణ తదితరులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజలవద్దకే ప్రభుత్వం : మంత్రి

ప్రజలకోసం నిరంతరం తపించేది కాంగ్రెస్ ప్రభుత్వమని, అందుకే ప్రజలవద్దకే సర్కార్ వస్తుందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారంనాడు జోగిపేట మున్సిపాలిటిలోని 17,18వార్డులలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం కొంతమంది మహిళల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు చిట్టిబాబు, సురేందర్‌గౌడ్, రంగసురేష్‌గుప్త, దాకూరి శంకర్, నాని, హరిక్రిష్ణగౌడ్, దుర్గేష్, చందర్, ఆర్డీవో పాండు, మున్సిపల్ ఛైర్మెన్ మల్లయ్య, కమీషనర్ తిరుపతి,కాంగ్రెస్ నాయకులు దాకూర వెంకటేషదాకూరి శ్రీనివాస్,అబ్బాస్‌అలి పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయ కమిటీని ప్రకటించిన దేవాదాయశాఖ

**కొమురవెల్లి, జనవరి 5, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి అలయ కమిటీని దేవాదాయ, ధర్మాదాయశాఖ శుక్రవారం ప్రకటించింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 20 మందితో జంబో కమిటిని విడుదల చేసింది. అలయ చైర్మన్‌గా చేర్యాల మండలం వేచరేని గ్రామానికి చెందిన పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులుగా కొమురవెల్లి గ్రామానికి చెందిన మేడికుంట శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్‌లకు చోటు దక్కింది. అలాగే రాజేశ్వరి, ఉమారాణి, శ్రీనివాస్, ప్రవీణ్ యాదవ్, సాయికుమార్, దామోదర్, శ్రీనివాస్, శ్రీనివాస్, నర్సింలు, బిక్షపతి, మోహన్‌రెడ్డి వీరభద్రప్ప, శ్రీనివాస్, రమేష్, రమణరెడ్డి, కిరణ్‌కుమార్ యాదవ్, మధుసూదన్, అంజయ్య యాదవ్‌లకు కమిటీలో డైరెక్టర్లుగా చోటు దక్కింది. ఈ కమిటీ బ్రహ్మోత్సవాల జాతర ముగింపు వరకు కొనసాగుతుంది.




## గురుకులలో ప్రవేశాలకు దరఖాస్తులకు నేడే చివరి అవకాశం

### -వరంగల్,కరీంనగర్ రీజినల్ కోఆర్డినేటర్ వెంకన్న

**అక్కన్నపేట,జనవరి05,ప్రభాతవార్త**
హుస్నాబాద్,అక్కన్నపేటతో పాటు ఉమ్మడి వరంగల్,కరీంనగర్ జిల్లాలో గల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతి ప్రవేశాలకు నేడు(శనివారం) సాయంత్రం వరకే అవకాశం ఉందని ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాలల వరంగల్,కరీంనగర్ జిల్లాల రీజినల్ కోర్డినేటర్ డిఎస్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్బంగా విడుదల చేసిన ప్రకటనలో గురుకుల పాఠశాలలో తమ పిల్లలను గురుకులాల్లో చదివించాలనుకునే తల్లితండ్రులు ఈ అవకాశాన్ని వినియో గించుకోవాలని,దరఖాస్తును ఆన్‌లైన్ సెంటర్‌లలో గురుకుల పాఠశాల వెబ్‌సైట్‌లో చేసుకోవాలని సూచించారు.

# ప్రజాపాలన దరఖాస్తులను జాగ్రత్తగా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**మెదక్ అర్బన్, జనవరి5 ప్రభాతవార్త:**
ప్రజా పాలనలో భాగంగా ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఎలాంటి తప్పులు దొర్లకుండా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రజా పాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ నమోదుపై ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల డిసెంబర్ 28, 2023 నుండి ఈ నెల 6వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రజా పాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను డాటా ఎంట్రీ ఆపరేటర్లు పరిశీలించి దరఖాస్తుల్లో ఉన్న పూర్తి సమాచారాన్ని కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లక తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మున్సిపాలిటీలలో 55 బృందాలు, గ్రామ పంచాయితీల్లో 425 బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ బృందంలో ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ఒక పంచాయితీ సెక్రటరీ, ప్రజా పాలన దరఖాస్తు కౌంటర్ ఇంచార్జి ఉంటారని తెలిపారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు 319 మంది ప్రభుత్వ డాటా ఎంట్రీ ఆపరేటర్లు, 161 ప్రైవేట్ డాటా ఎంట్రీ ఆపరేటర్లు, మొత్తంగా 480 డాటా ఎంట్రీ ఆపరేటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లో సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఒక్కొక్క కంప్యూటర్ ఆపరేటర్‌కు 500 దరఖాస్తులు ఎంట్రీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 6వ తేదీ నుండి 17వ తేదీ లోగా దరకాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు, సెల్ నెంబర్లను పూర్తి జాగ్రత్తతో తప్పుడు లేకుండా నమోదు చేయాలన్నారు. ఎంట్రీ చేసిన దరఖాస్తులు ఒక్కటి కూడా గల్లంతు కాకుండా పూర్తి జాగ్రత్త వహించి భద్రపరచాలన్నారు. ఈ రోజు నుంచే పనులు ప్రారంభించాలని అన్ని సెంటర్లలో అవసరమైన స్పీడ్‌గా పనులు పూర్తి చేసేందుకు ఇంటర్నెట్ సదుపాయంతో పాటు నిరంతర విద్యుత్ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. పనులన్నింటీన నాణ్యతతో వేగవంతంగా గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా పారదర్శకంగా పనులు పూర్తి చేయాలిని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ డాటా ఆధారంగానే లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం డాటా ఎంట్రీ ఆపరేటర్ల సందేహాలను కలెక్టర్ రాజర్షిషా నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రమేష్, జిల్లా పంచాయితీ అధికారి సాయిబాబా, ఈడీఎం సందీప్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేట కలెక్టరేట్‌లో...**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో స్వీకరించిన ధరఖాస్తులన్నింటిని ప్రతి అపరేటర్ జాగ్రత్తగా కంప్యూటర్‌లో అప్లోడ్ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తుల డేటా ఎంట్రీ చేయడంపై ఎంపిక చేసిన అపరేటర్లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం పేరు మీద ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం ప్రజా పాలన అన్నారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ గ్యారెంటీ పథకాలపై స్వీకరించిన దరఖాస్తులను అన్‌లైన్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో గ్రామానికి ఒకరు చొప్పున మొత్తం 552 మంది అపరేటర్లు 26 మంది మాస్టర్ ట్రైనర్స్ పని చేయనున్నారని తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమం ఈనెల 6తో ముగిస్తుందన్నారు. అపరేటర్లు తమకు కేటాయించిన గ్రామ దరఖాస్తులను అన్‌లైన్‌లో అప్లోడింగ్ పూర్తి చేయాలన్నారు. దరఖాస్తు దారులు రాసిన వివరాలను మాత్రమే ఎంట్రీ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో దరఖాస్తులలో ఎలాంటి కరప్షన్ చేయొద్దన్నారు. అపరేటర్లకు ఎలాంటి సమస్యలు వచ్చిన ఎంపిడిఓ లేదా తహశీల్దార్, మాస్టర్ ట్రైనర్స్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. అపరేటర్లు చేసే ప్రతిది జిల్లా కలెక్టర్ లాగిన్‌లో ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి అపరేటర్ జాగ్రత్తగా ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్లోడ్ చేయాలని అదేశించారు. కార్యక్రమంలో డిఅర్‌డిఎ పిడి జయదేవ్ అర్యా, డిపివో దేవకీదేవి, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రహమాన్, డిఎల్‌పిఓలు, ఎంపిడిఓలు, ఎంపిఓలు తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న కళ్యాణోత్సవానికి పటిష్టమైన బందోబస్తు

### -అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాసరావు



స్వామి వారి కళ్యాణోత్సవ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాసరావు

**కొమురవెల్లి, జనవరి5, ప్రభాతవార్త :**
కొమురవెల్లి మండలకేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం ఈనెల 7న నిర్వహిస్తుండడంతో జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అదేశాల మేరకు శుక్రవారం బందో బస్తు ఏర్పాట్లను సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు, హుస్నాబాద్ ఏసీపీ సతీష్‌తో కలిసి పరిశీలించారు. కళ్యాణం జరిగే తోటబావి, శీగ్రదర్శనం,స్పెషల్ దర్శనం, జనరల్ దర్శన, క్యూలైన్లు,కళ్యాణ కట్ట వద్ద విఐపి గ్యాలరీ, జనరల్ గ్యాలరీ, కళ్యాణం తర్వాత భక్తులు సందర్శించే ఇన్‌కమింగ్, అవుట్ గోయింగ్ ప్రదేశాలను విఐపి పార్కింగ్, జనరల్ పార్కింగ్ ప్రదేశాలను అయన క్షేత్రస్థాయిలో పరిశీలించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కళ్యాణోత్సవంతో పాటు జాతర సందర్భంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పోలీసు కంట్రోల్ రూం ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు ఇబ్బందులు రాకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అయన వివరించార. అయన వెంట అలయ ఈవో బాలాజీ, ఏఈవో అంజయ్య, చేర్యాల సీఐ సత్యనారాయణ, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు, మద్దురు ఎస్ఐ యూనిస్ హైమద్ అలీ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## మల్లన్న కళ్యాణ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం ఈనెల7న నిర్వహించనుండడంతో జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం అలయ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. కళ్యాణానికి, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అయన వెంట అలయ ఈవో బాలాజీ, ఏఈవో అంజయ్య తదితరులు ఉన్నారు.

## 6న స్వామి వారి రాక

కాగా శ్రీ మల్లికార్జున స్వామి వార్షిక కళ్యాణోత్సవం సందర్భంగా ఉజ్జయిని పీఠాధిపతులు శ్రీ 1008 జగద్గురు సిదలింగరాజదేశీ కేంద్ర శివాచార్య మహా స్వామీజీ ఈనెల 6న కొమురవెల్లి దేవాలయానికి రానున్నారు.

# ముస్లాపూర్‌లో 6 ఇండ్లలో చోరీ



ఇంట్లో వస్తువులను చిందవ వందరగా పడేసిన దుండగులు



ఇంట్లో జరిగిన దొంగతనాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారి దృశ్యం

**అల్లాదుర్గం, జనవరి 5, ప్రభాతవార్త:**
మెదక్ జిల్లా అల్లాదుర్గం పోలీసు ఠాణా పరిధిలోని ముస్లాపూర్‌లో గురువారం అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. గ్రామంలోని 6 ఇండ్లలో దొంగలు చొరబడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... గ్రామంలోని బిసి, ఎస్సీ కాలనీలోని పలు గృహాలలో బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును దొంగలు దోచుకుని పోయారు. గ్రామానికి చెందిన బండరీ మూర్తి ఇంట్లో తులం బంగారంతో పాటు 10వేల రూపాయల నగదు, హన్మకడి బాబు ఇంట్లో 35వేల నగదు, రామకిష్టయ్య ఇంట్లో తులం బంగారంను దొంగలు తస్కరించుకుపోయారు. దొంగతానికి గురైన ఇండ్ల వారు పోలీసులకు అందించిన సమాచారంలో పోలీసులు క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకుని దోపిడికి గురైన ఇండ్లను పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## హుస్నాబాద్‌లో పట్టపగలే రెండు చోట్ల చోరీ

### -ధర్యప్తు చేస్తున్న క్లూస్‌టీం...హుస్నాబాద్ పోలీసులు

**హుస్నాబాద్,జనవరి05,ప్రభాతవార్త**
పట్టపగలే హుస్నాబాద్‌లో రెండు దొంగ తనాలు జరిగిన సంఘటన కలకలం సృష్టించింది.వివరాల్లోకి శుక్రవారం రోజున హుస్నాబాద్ పట్టణంలోని రెడ్డి కాలనీకి చెందిన ఒక ప్రయివేట్ బ్యాంకులో విధులు నిర్వహించే కాయిత వికాస్‌రెడ్డి ఉదయం ఒక ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంట్లో చొరబడి రూ 1లక్ష50వేలతో పాటు రెండు తులాల బంగారం చోరీకి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేయగా స్పందించిన పోలీసులు అక్కడ దగ్గరలో ఉన్న సిసి కెమోరాలు చెక్‌చేసి దొంగ ఫోటో గుర్తించారు.తలకు టోపి,మోహానికి కర్చీఫ్ కట్టుకుని ఇంట్లోకి వెళ్లి అపహరించినట్లు గుర్తించి దొంగను చూసిన వారు ఆచూకి తెలపాలని సామాజిక మాద్యమాల్లో ప్రచారాలు నిర్వహిస్తుండగానే పట్టణంలోని రావుస్ కాలనీకి చెందిన ప్రముఖ వ్యాపారి పెద్ది రవిందర్ ఇంట్లో సైతం దొంగతనం జరిగి రూ 50వేలతో పాటు ఏడు తులాల బంగారం అపహరించబడిందని తెలుసుకున్న హుస్నాబాద్‌సీఐ ఎర్రల కిరణ్,ఎస్ఐ తోట మహేష్‌లు క్లూస్‌టీంతో ధర్యప్తు మొదలు పెట్టారు.పట్టపగలే అది రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి,హుస్నాబాద్ శాసనసభ్యులు పొన్నం ప్రభాకర్ ఇంటి పక్కనే మొదటి దొంగతనం జరగడం సంచలనం సృష్టించింది.



బాధితుని ఇంట్లో పరిశోధన చేస్తున్న పోలీసులు

## దరఖాస్తుల ఎంట్రీ సజావుగా పూర్తి చేయాలి

### -అధికారులకు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచన




సమవేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 5, ప్రభాతవార్త:**
ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజలు అందచేసిన ధరఖాస్తులను డేటా ఎంట్రీ చేసేముందు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పులు దొర్లకుండా వంద శాతం కరెక్టుగా నమోదు చేసేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కలెక్టర్ ఆడిటోరియంలో ఎంపిడిఓలు, తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్లు, టీం లీడర్లకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ ధరఖాస్తులోని వివరాలను ఆన్‌లైన్ చేశాక ఆ వివరాలతోనే వెరిఫికేషన్ చేసి అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. డేటా ఎంట్రీని ప్రభుత్వ కార్యాలయల్లోనే జరిపించాలన్నారు. నిర్ణీత సమయంలో డేటా ఎంట్రీని సజావుగా పూర్తి చేయాలన్నారు. సమస్యలు ఉత్పన్నం అయితే జిల్లా స్థాయి కంట్రోల్ రూంకు ఫోన్ చేసి సమస్యను నివృత్తి పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపాల్ కమిషనర్లు, తహసీల్దార్‌లు ఎంపిడిఓలు డేటా ఎంటరటీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## స్వచ్ సర్వేక్షన్‌లో మెరిసిన సిద్దిపేట పట్టణం

### -జాతీయ కీర్తిలో మరో మైలు రాయి



సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
సిద్దిపేట పట్టణం జాతీయ స్థాయిలో మరో సారి మెరిసింది..సిద్దిపేట పేరు లేనేది అవార్డు అంటూ ఉండదని ఎమ్మెల్యే హరీష్‌రావు అనే మాట ఎప్పటికీ నిదర్శనం అని చూపుతుంది. ప్రతి యేటా ప్రకటించే స్వచ్ సర్వేక్షన్ అవార్డుల్లో నేడు జాతీయ స్థాయిలో సిద్దిపేట పట్టణం మరో కీర్తి సాధించింది. సిద్దిపేట అంటే స్వచ్ఛత..శుభ్రత..శుద్దిపేట అనే మాటలకు ఈ అవార్డులే నిదర్శనం. చెత్త సేకరణలో సమర్థవంత నిర్వహణకు తడి, పొడి, హానికర చెత్తలను వేరు చేయడం పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల్లో చైతన్యం తేవడం సిటీజన్స్ ఫీడ్ బ్యాక్‌లో అగ్రస్థా నంలో నిలిచి జాతీయ స్థాయిలో మెరిసింది. దేశంలో జాతీయ స్థాయిలో గ్రేటర్ హైదారాబాద్ జాతీయ స్థాయి జోనల్ విభాగంలో లక్షకు పైగా జనాభా ఉన్న సిద్దిపేట పట్టణం స్వచ్ సర్వేక్షన్‌లో అగ్రస్థానంలో నిలిచింది.

**ప్రజల సహకారం..ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతోనే సాధ్యం**

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు**

జాతీయ స్థాయిలో..రాష్ట్ర స్థాయి అవార్డు ప్రకటించారు అంటే సిద్దిపేట పేరు లేకుండా అవార్డు అంటూ ఉండదు..అందుకు నిదర్శనం నేడు ప్రకటించిన అవార్డునే అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. చెత్త సేకరణలో ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చడంలో పారిశుద్యంతోనే సిద్దిపేట పేరు ఎల్లలు దాటుతోందన్నారు. ప్రజల సహకారం చాలా గొప్పదన్నారు. ప్రజల్లో చైతన్యం తేవడంలో కౌన్సిలర్లు చూపించిన చొరవ మున్సిపల్ అధికారుల పనితీరుతో సిద్దిపేటకు అవార్డు దక్కిందన్నారు. కౌన్సిలర్లు, అధికారులను మాజీ మంత్రి అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో మరిన్ని అవార్డులు సాధించేలా కృషి చేయాలన్నారు.

## శ్రీ రాఘవేంద్ర బృందావనంలో శ్రీమఠం సంస్థానపూజ

**వర్గల్, జనవరి 5 (ప్రభాతవార్త):**
వర్గల్ మండల పరిధిలోని అంనతగిరిపల్లి శ్రీ రాఘవేంద్ర బృందావనంలో ఈనెల 7, 8 తేదీలలో శ్రీమఠం సంస్థానపూజ నిర్వహించడం జరుగుతుందని రాఘవేంద్ర బృందావన సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధుత్తరాధి మతాదీషులు హాజరై 1008 సత్యత్మ తీర్థ శ్రీపాదుల వారు ప్రారంభోత్సవం, భక్తులకు అనుగ్రహ భాషణం, పూజాది కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఆదివారం స్వామివారికి పూర్ణకుంభ స్వాగతం పలికి సభ్యులకు ముద్రధారణ, స్వామివారికి మూలరామ పూజ ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తారని, సోమవారం మూలరామ పూజ, ముద్రధారణ, తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు. ఈ పూజా కార్యక్రమాలను మద్వ మండలి అధ్యక్షులు నందగిరి ఉపేందర్‌రావు, చైర్మన్ ములుగు ప్రవీణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో కొల్లాపూర్ గోవర్ధన్‌రావు నిర్వాహకులుగా చేపట్టడం జరుగుతుందన్నారు. ఇట్టి పూజా కార్యక్రమాలకు రాష్ట్ర వ్యాప్తంగా మద్వ మండలి సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలొద్దు

### -అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 5, ప్రభాతవార్త:**
రేషన్ బియ్యం (పిడిఎస్ బియ్యం) బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా పౌర సరఫరాల అధికారులు, డిఆర్‌డిఓ, డిసిఓ తదితర అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వానాకాలం జీన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేసిన కేంద్రాలు, గన్ని బ్యాగుల వివరాలు, రేషన్ కార్డుల పెండింగ్‌ర రైస్ మిల్లింగ్ కెపాసిటీ, మిల్లర్ల వివరాలు, సిఎంఆర్ డెలివరీ తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచి రెగ్యూలర్గా విస్తృతమైన తనఖీలు చేపట్టాలన్నారు. వానాకాలం, ఖరీఫ్‌కు సబంధించి 96 శాతం సిఎంఆర్ పూర్తయిందని, రబీకి సంబంధించి 31 శాతం పూర్తయిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వంద శాతం సీఎంఆర్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో డిఎస్ఓ వనజాత, సివిల్ సప్లై డిఎం సుగుణబాయ్, డిఆర్‌డిఓ శ్రీనివాసరావు, డిసిలో తుమ్మ ప్రసాద్, అదనపు పిడి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య అక్షింతలు పొందడం పూర్వజన్మ పుణ్యం

**గజ్వేల్ టౌన్, జనవరి 5 (ప్రభాతవార్త):**
అయోధ్య రాముని అక్షింతలను గజ్వేల్ పట్టణంలోని శ్రీ సీతారామ ఉమామహేశ్వరాలయంలో శుక్రవారం పూజలు జరిపి శ్రీ రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజుకు అయోధ్య ట్రస్టు ప్రతినిధి, సామాజిక సమరసత రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల నరేష్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ అయోధ్య రాముని అక్షింతలను పొందడం పూర్వజన్మ పుణ్యమని అన్నారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరుగుతున్న సందర్భంగా ఆ రోజు ప్రతి ఒక్కరూ దేవాలయాలకు వెళ్ళి పూజలు ముగించుకొని అక్షింతలను వ్యక్తిగతంగా నెత్తిన ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల మధు, పెండ్యాల శ్రీను, అయిల మహేందర్, వేములవాడ కనకాచారి, వెంకట్రాంరెడ్డి, రాజు, ఆలయ అర్చకులు బీటుకూరి శ్రీనివాస్, మఠం శివకుమార్, వెనవెల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



రామరాజుకు అయోధ్య రాముని అక్షింతలను అందజేస్తున్న నరేష్‌బాబు



రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కలుసుకున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

## మంత్రిని కలుసుకున్న జిల్లా కలెక్టర్

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 5, ప్రభాతవార్త:** సంగారెడ్డి పట్టణంలోని నివాసంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహాను జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మంత్రికి జిల్లా కలెక్టర్ పూల బొకేను అందించారు.

## 7 నుంచి కీజర్ యాపై క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్‌కు ముస్తాబైన్ బాగారెడ్డి స్టేడియం

**జహీరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో కీజర్ యాపై అంతరాష్ట్ర గోల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్ కొరక పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం ముస్తాబయింది. టోర్నమెంట్‌లో 14 క్రికెట్ జట్లు (ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్, తమిళనాడు, బెంగళూరు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలు) తలపడనున్నాయని టోర్నమెంట్ నిర్వాహకులు కీజర్ యాపై పేర్కొన్నారు. టోర్నమెంట్ విజేత జట్టుకు ట్రోఫీతో పాటు 555555 నగదు, రన్నర్ జట్టుకు 333333 నగదుతో పాటు ట్రోఫీ అందచేయనున్నామన్నారు. మ్యాచ్‌కి 50 వేల నగదు, ట్రోఫీ, ప్రతి రోజు నిర్వహించే మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌కు 1వేయి రూపాయల నగదుతో పాటు ట్రోఫీ అందించనున్నమన్నారు. టోర్నమెంట్‌ను వీక్షించేందుకు నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చే క్రీడాభిమానులకు తగు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## ఎస్టియుటిఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



ఎస్టియుటిఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

**సంగారెడ్డి మునిసపాలిటి, జనవరి 5, ప్రభాతవార్త:** సంగారెడ్డిలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ వల్లూరి క్రాంతి ఎస్టియుటిఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ జిల్లాలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధియే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషిసల్పాలని, అందుకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు సయనయద్ సాబేర్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎంఎ హఫీజ్, జీవన్ రాథోడ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణ కుమార్, సమసేనత ఉపాధ్యాయ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌కే షా అలీ, కయ్యూం, విజయ్‌కుమార్, సమి, సమద్, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, అంజద్ అలి, లక్ష్మయ్య, ప్రకాష్, సిద్దారెడ్డి, కిషన్, భారతి, వాణి, లలితాంబిక, సుమన్ లత, లావణ్య, అనిత, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## టిపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



టిపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, జనవరి 5 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో టిపిటిఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను సమాజ నిర్మాతలుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, వారి బాధ్యతలను గుర్తుచేసే విధంగా టిపిటిఎఫ్ క్యాలెండర్ నిలబడు అనే మోటోతో ఉండడం హర్షణీయమన్నారు. టిపిటిఎఫ్ మండల అధ్యక్షుడు నేతి శంకర్ మాట్లాడుతూ 2024 సంవత్సరాన్ని సమస్యల సాధన సంవత్సరంగా టిపిటిఎఫ్ సంఘం భావిస్తుందని అన్నారు. సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల దీర్ఘకాలిక బిల్లులు అన్నీ మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగదేవ్‌పూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సైదులు, టిపిటిఎఫ్ మండల నాయకులు అంకం వెంకటేశ్వర్లు, రాములు, కనకయ్య, జలందర్‌రెడ్డి, బాలనర్సింహారెడ్డి, మురళి, రాజేష్, మహ్మూద్, నర్సింలు, చంద్రం, నాగభూషణం, శోభారాణి, మంజుల, అరుణ, భవాని, అమృతమ్మ, రాజేశ్వరి, లక్ష్మి, బాలమణి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్



దరకాస్తులు స్వీకరిస్తున్న ఆంజనేయులుగౌడ్, అధికారులు

**నర్సాపూర్, జనవరి 5,ప్రభాతవార్త:** ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండలంలోని మాదాపూర్, మూసీపేట్, మమ్మదాబాద్, చల్లారెడ్డిగూడా తండా తదితర గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటు కేవలం నెలరోజులు గడవక ముందే ప్రజా పాలనలో ఆరు గ్యారంటీల పథకాలను అమలు చేసేందుకు శ్రీకారంచుట్టి చరిత్ర సృష్టించ న్నారు. కార్యక్రమంలో ఎంపిడవో మార్టిన్ లూథర్, ఏవో అనిల్‌కుమార్, సర్పంచ్ సంతోషబిక్కునాయక్, ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, మాజీ జడ్‌పిటిసీ శ్రీనివాస్‌గుప్త, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేషం, నర్సాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మురళీయాదవ్ అసమర్థత వల్లే అభివృద్ధి కుంటుపడింది

## అవిశ్వాస తీర్మానంలో నెగ్గలేనన్న భయంతోనే రాజీనామా.. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుల



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నహిమొద్దీన్

**నర్సాపూర్, జనవరి 5, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అసమర్థతవల్ల నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో వెనకబడిపోయిందని బిఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్ అశోక్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, పిఎసిఎస్ చైర్మన్ రాజుయాదవ్ అన్నారు. శుక్రవారం వారు నర్సాపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి నిధుల మంజూరు చేయలేదని మురళీయాదవ్ మాట్లాడంలో అర్థం లేదన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.65 కోట్లు మంజూరు చేసిందని, మురళీయాదవ్ చేతగానితనం వల్లే అందులో 15 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని చెప్పారు. మిగతా 50 కోట్లతో అభివృద్ధి పనులు చేయాల్సి ఉండగా మురళీయాదవ్ కమీషన్లు అడగడంవల్లే టెండర్‌లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని విమర్శించారు. మురళీయాదవ్ గత 25 సంవత్సరాలుగా నర్సాపూర్ సర్పంచ్‌గా, భార్య జడ్‌పి చైర్‌పర్సన్‌గా ప్రస్తుతం ఆయన మున్సిపల్ చైర్మన్‌గా పదవులు చేపట్టి నర్సాపూర్‌పట్టణానికి చేసిందేమిలేదన్నారు. మురళీయాదవ్ కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా అయ్యేందుకు బిఆర్ఎస్ పార్టీ పెట్టిన బిక్షేనన్నారు. అటువంటి పార్టీనివిమర్శించడం ఆయనకు తగదని అన్నారు. మురళీయాదవ్ స్వచ్ఛందంగా రాజీనామా చేయలేదని అవిశ్వాస తీర్మానంలో ఓడిపోతానన్న భయంతోనే రాజీనామా చేశాడన్నారు. పట్టణంలో వివిధ ప్రభుత్వ భవనాలను కూల్చీవేయగా వచ్చిన స్క్రాప్‌ను అక్రమంగా అమ్ముకున్నాడని వారు ఆరోపించారు. ఈ మేరకు మురళీయాదవ్ అక్రమ ఆస్తులను త్వరలోనే బయటకు తీస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాంచందర్, బిఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, కుమ్మరి నాగేశ్, ఆంజనేయులుగౌడ్, నాగరాజుగౌడ్, జ్ఞానేశ్వర్, సాగర్, రింగుల ప్రసాద్ రాకేశ్‌గౌడ్, కొండి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్ డే కార్యక్రమంలో చిన్నారులు

## శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో గ్రీన్ డే

**గజ్వేల్ టౌన్, జనవరి 5 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో శుక్రవారం గ్రీన్ డేఆకుపచ్చ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ఆకుపచ్చని కూరగాయలు, ఆకుకూరలు తేవడంతో పాటు వాటిని ఒక అంగడిలా పెట్టి క్రయ విక్రయాలు జరిపినట్లు పాఠశాల కరస్పాండెంట్ హరిణాపవన్ తెలిపారు. ఆకుపచ్చని వర్ణంలోని పండ్లు, కూరగాయల మాదిరిగా పిల్లలు తయారైరావడంతో వాటి ఆకారం, వాటి పేర్లు, వాటి ప్రాధాన్యత విద్యార్థుల మనసులో ముద్రించుకుంటుందని అన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## 20 వసంతాలు పూర్తి చేసుకున్న హరేరామ భజన బృందం

**గజ్వేల్, జనవరి 5 (ప్రభాతవార్త):** రామనామమే శాశ్వతమని నమ్మిన హరే రామ హరేకృష్ణ భజన బృందం 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం అద్దాల మందిరం వద్ద సీతారాములకు సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ప్రతిరోజూ ఉదయం 4 గంటల వరకు రామాలయంకు చేరుకొని హరేరామ నామ సంకీర్తనను ప్రారంభించి సూర్యోదయంలోపు హారతి ఇచ్చేవారమని తెలిపారు. మనకు చివరివరకు తోడు వచ్చేది, వెంట ఉండి నడిపించేది రామ నామమే అన్నారు. ప్రతి రోజు రామ నామాన్ని స్మరించాలి, లిఖించి తరలించాలన్నారు.

## ఆర్టీసీ అధికారులు, కార్మికులు ఐక్యంగా ఉండాలి

### ఆర్టీసి డిప్యూటీ ఆర్ఎం దైవాదీనం

**నర్సాపూర్, జనవరి 5.ప్రభాతవార్త:** ఆర్టీసి అధికారులు, కార్మికులు, డిపో కార్మికులు కలిసికట్టుగా ఉండాలని ఆర్టీసి డిప్యూటీఆర్ఎం దైవాదీనం అన్నారు. ఆర్టీసి ఎండి సజ్జనార్ ఆదేశాలమేరకు శుక్రవారం నర్సాపూర్ ఆర్టీసి డిపో అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో వన భోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్టీసి డిప్యూటీ ఆర్ఎం దైవాదీనం హజరుకాగా నర్సాపూర్ ఆర్టీసి డిపో లో వంటలువార్పులు చేసుకొని సంతృప్తి బోజనాలు స్వీకరించారు. ఈసందర్భంగా డిప్యూటీ ఆర్ఎం దైవాదీనం మాట్లాడుతూ ఆర్టీసి కార్మికులు అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా ఉండి అదికారుల సూచించిన సూచనలు తప్పక పాటించాలన్నారు. ఆర్టీసి ని లాబాల బాటలో నడిపించడానికి ప్రతి ఒక్క ఆర్టీసి కార్మికుడు కృషి చేయాలన్నారు.ఈ మేరకు నర్సాపూర్ ఆర్టీసి డిపో లో ఈ వనబోజనా ల కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు.ఇలాంటి కార్యక్రమాల ద్వార ఆర్టీసి కార్మికుల అధికారుల ఐక్యత చేసెందుకు వీలుకలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసి డిప్యూటీ ఆర్ఎం దైవాదీనం తో పాటుఅసిస్టెంట్ మేనేజర్ శ్రీనరివాస్‌రెడ్డి,డిపో ఇంచార్జీ లక్ష్మయ్య,ఆర్టీసి సిబ్బందినరెందర్, వెంకటేశ్‌గౌడ్,పోచయ్య లతో పాటు కండక్టర్‌లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లు కోర్టు భవన నిర్మాణం చేపట్టండి

**ఆమనగల్లు, జనవరి05, ప్రభాతవార్త:** ఆమగనల్లు జూనియర్ సివిల్ కోర్టుకు సొంత భవన నిర్మాణం చేపట్టాలని ఆమనగల్లు బార్ అసోషి యేషన్ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరింది. ప్రజ లకు ఇబ్బందులు తలెత్తకుండా అనువైన స్థలంలో విశాలంగా సొంత భవనం నిర్మాణం ఉండాలని వారు కోరారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలోని బార్ అసోషియేషన్ కార్యాలయంలో శుక్రవారం న్యాయ వాదులు కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎంపికైన కసిరెడ్డి నారాయణరెడ్డిని ఘ నంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే వారితో ఇష్టాగోష్టిగా మాట్లా డారు. ఈసందర్భంగా న్యాయవాదుల బృందం మాట్లాడుతూ ప్రస్తుతం కోర్టు నిర్వహిస్తున్న స్థలంలో 5ఎకరాలు కేటాయించి సొంత భవనం నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు. మండల పరిషత్ స్థలం కోర్టు వినియోగదారులకు అనువైన స్థలంగా వారు వివరించారు. దీంతో ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ తహశీల్దార్‌తో మా ట్లాడి కోర్టు సొంత భవనానికి కావలసిన స్థలం అన్వేషిస్తామని తెలిపా రు. వృత్తిలో న్యాయవాదులు కొంత మానవతా దృక్పతాన్ని అవలం భించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. నిస్వార్థంతో పేదలకు న్యాయ సేవలందించే ఒరవడిని అనుసరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ ప్రతినిధులు లక్ష్మణశర్మ, ఉపాధ్యక్షులు యాదిలాల్, మల్లెపల్లి జగన్, ప్రచార కార్యదర్శి దుద్దు ఆంజనేయులు, న్యాయవాదులు వెంకట్‌గౌడ్,తదితరులు ఉన్నారు.

## చెన్‌గోముల్‌లో ఇంటింటికి అక్షింతలు వితరణ

**పూడూరు, జనవరి 5, ప్రభాతవార్త :** రామజనమ్మభూమి అక్షింతల వితరణ గడపగడపకు అందజేయడం పూర్వజన్మ సుకృతంగా భావి స్తామని పలువురు బిజెపి నాయకులు అన్నారు.శ్రీరామ జన్మభూమి నుండి వచ్చిన అక్షింతలను శుక్రవారం పూడూరు మండలం పరిధి లోని చెన్‌గోముల్ గ్రామంలో ఇంటింటికి అందజేశారు.ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రామజన్మ భూమినుండి వచ్చిన అక్షింత లను కుల,మతాలకు అతీతంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి అసెంబ్లీ నియోజకవర్గ బిజెపి నాయకులు కన్న య్యొల్ల రాజు,నాయకులు రాజేష్‌గౌడ్,అనంతరాములుగౌడ్, యాదిరెడ్డి, అంజయ్యగౌడ్,పాండు తదితరులు పాల్గొన్నారు.

## హైమాక్స్ లైట్లు బాగు చేయాలి

**కుల్కచర్ల; జనవరి 05 ;ప్రభాతవార్త;** గత కొన్నిరోజులుగా నిరుపయోగంగా ఉన్నహైమాక్స్ లైట్లు బాగు చేయాలని వార్డు మెంబర్లు కాట న్పల్లి మహిపాల్,మోత్కూరి వెంకటేష్ తెలిపారు.శుక్రవారం వికారా బాద్ జిల్లా కుల్కచర్ల మండల గ్రామ పంచాయతి కార్యాలయంలో హైమాక్స్ లైట్లు వెలగడం లేదని పంచా యతి కార్యదర్శి శ్రీనివా స్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగావారు మాట్లా డుతూ దేశానికి పట్టు కొమ్మల్లాంటి పల్లెటూళ్లలో ఆర్భాటంగా ఏర్పా టు చేసిన హైమాక్స్ వీది దీపాలు అలంకార ప్రాయంగా మారాయి. కొన్ని రోజులుగా కాంతులను వెదజల్లిన వీదులు నేడు అందకారాన్ని తలపిస్తున్నా యని వారు తెలిపారు.కుల్కచర్ల ప్రదాన చౌరస్థాలో ఏర్పాటు చేసిన లైట్లు గత కొన్ని నెలలుగా వెలగక చీకటిలో ప్రజలు వాహనదారులు రోడ్డుపై ఏర్పాటు చేసుకున్న దుకాణదారుటు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైన స్పందించి మర మ్మత్తులు చేయడమా లేక కొత్తవి ఏర్పాటు చేయడమా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ గొల్ల ఆంజనేయులునాయకులు కృష్ణారెడ్డి,లొద్ద నర్సిములు పాల్గొన్నారు.



బాధితునికి ఫోన్‌ను అందజేస్తున్న ఎస్ఐ విజయభాస్కర్

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ బాధితుడికి అందజేత

**వర్గల్, జనవరి 5 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం తునికిఖాల్సా గ్రామ సమీపంలోని స్పిన్నింగ్ మిల్‌లో పనిచేస్తున్న అజితసింగ్ నాలుగు రోజుల క్రితం మొబైల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే గౌరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా సిఈఐఆర్ టెక్నాలజీ ద్వారా పరిశోధన చేసి అట్టి ఫోన్‌ను తిరిగి బాధితునికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విజయభాస్కర్ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్‌పోతే వెంటనే సీఈఐఆర్ టెక్నాలజీలో వివరాలు నమోదు చేసుకోవాలని, ఎవరైనా సెకండ్ హ్యాండ్ ఫోన్లు అమ్ముతున్నట్లయితే ఎటువంటి బిల్లులులేకుండా సెకండ్‌హ్యాండ్ ఫోన్‌లు కొనవద్దని సూచించారు.

## ఐఐటి హైదరాబాద్‌లో ఇన్వెంటివ్ ఫెస్ట్

### -ఐఐటి డైరెక్టర్ బిఎస్ మూర్తి




సమావేశంలో మాట్లాడుతున్న బిఎస్ మూర్తి

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 5, ప్రభాతవార్త:** ఈ నెల 19 నుంచి 20వ తేదీవరకు సంగారెడ్డి సమీపంలోని ఐఐటి హైదరాబాద్‌లో ఇన్నెవేట్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ బిఎస్ మూర్తి తెలిపారు. శుక్రవారం ఐఐటి బోర్డ్ ఆఫ్ గవర్నర్ బివి మోహన్‌రెడ్డితో కలిసి మూర్తి మాట్లాడుతూ నూతన పరిశోధనలను ప్రోత్సాహించేలా ఐఐటి హైద్రాబాద్ వేదికగా ఇన్వేంటివ్ రెండోదఫా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు రూపొందించిన 240 కొత్త నెన్నోవేషన్‌లలో 120 ఇన్నోఏషన్‌లను ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఉత్తమంగా ఎంపికైన వాటిని ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా తయారీ రంగాలను ప్రోత్సాహించడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సమావేశంలో ప్రొఫేసర్ జె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జమియితే ఉలేమా ఏ హింద్ సేవలు అభినందనీయం

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**తాండూరు, జనవరి 5, ప్రభాతవార్త :** జమియితే ఉలేమా ఏ హింద్ సేవలు అభినందనీయమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జమియితే ఉలేమా ఏ హింద్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు మౌలానా మహామ్మ ద్ అబ్దుల్లా అజహర్ ఖాస్మీ, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహమాన్ అతహర్ ఖాస్మీల ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలోని జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రె డ్డికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జమియితే ఉలేమా ఏ హింద్ సేవలు అభినందనీయమని కొనియాడారు. సంస్థ చేస్తున్న సామాజిక సేవా, అభివృద్ధి పనులకు తన వంతు ప్రోత్సాహం ఉంటుందని తెలి పారు. తాండూరు ప్రాంత ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని అన్నారు. ఎన్నికల ముందు ఇమామ్‌లు, మౌజ్‌లకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని తెలి పారు. అంతకుముందు జిల్లా అధ్యక్షులు మౌలానా మహమ్మద్ అబ్దుల్లా అజహర్ ఖాస్మీ సంస్థ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అబ్దుల్ రావూఫ్, తాండూరు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కమల్‌అతహర్, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## 8న గట్టుమైసమ్మగుట్ట ఆలయ టెండర్ల బహిరంగ వేలం

**ఘట్‌కేసర్, జనవరి 5, ప్రభాతవార్త:** ఈనెల 8న ఘట్‌కేసర్ శ్రీగట్టు మైసమ్మగుట్ట దేవస్థానంలో టెంకాయ, పూజా, టెంట్ సామాగ్రి సరఫరా హక్కులకు బహిరంగ వేలం వేయనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎల్.భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ శ్రీగట్టు మైసమ్మగుట్ట దేవస్థానంలో సోమవారం ఉదయం 11 గంటలకు దేవాదాయ–ధర్మాదాయశాఖ నియమ నిబంధ నలను అనుసరించి నిర్వహించే వేలంలో ఆసక్తి కల్గిన వారు పాల్గొనాలని కోరారు. 1).కొబ్బరికాయలు, పూజాసామాగ్రి టెండర్ కాలపరిమితి 15 జనవరి 2024 నుంచి 14 జనవరి 2025 వరకు ఉంటుందని దీనికి రూ.10,000లు ధరావత్తు చెల్లించాలని తెలిపారు. 2). భక్తులకు టెంట్‌హౌజ్ సామాగ్రీ సరఫరా చేసే హక్కు 15 జనవరి 2024 నుంచి 14 జనవరి 2025 వరకు కాలపరిమితి ఉంటుందని దీనికోసం రూ. 10,000లు చెల్లించాలని తెలిపారు. దేవాలయ ఉద్యోగులు, ఆల యానికి బకాయిపడిన వారు వేలంలో పాల్గొనుటకు అనర్హులని, వేలంలో పాల్గొనే వారు ముందుగా దేవస్థానంలో ధరావత్తు చెల్లించాల్సీ ఉంటుందన్నారు. ధరావత్తు చెల్లించని వ్యక్తి వేలంలో ప్రత్యేక్షంగా గాని పరోక్షంగా గాని పాల్గొనే అవకాశం ఉం డదని, హెచ్చుపాటదారుని వేలం పాట దేవాదాయశాఖ ఆమోదం మేరకు ఉంటుం దన్నారు. వేలం పాట అయిన వెంటనే హెచ్చుపాటదారుడు వేలం సొమ్ము సగం వెంటనే చెల్లించాలని మిగతా సొమ్ము 2 రోజులలోపు చెల్లించాలని పేర్కొన్నారు. దేవస్థానం నిర్దేశించిన స్థలంలోనే సదరు దుకాణం నిర్వహించాలని, ఏడాది కాలపరిమితి ముగిసిన తర్వాత దుకాణాలను ఖాళీ చేసి దేవస్థానంకు అప్పగించాలని పేర్కొన్నారు. సమయానుకూలంగా షరతులు మార్చుటకు, ఎలాంటి కారణం చూపకుండానే వేలం పాటను నిలుపుదల, వాయిదా వేయడానికి దేవస్థానంకు సంపూర్ణ అధికారం ఉందని ఈఓ భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గోవిందు నరేష్

## పాలక పదవుల నియామకాల్లో మాదిగలకు న్యాయం చేయాలి

### -ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్

**గజ్వేల్, జనవరి 5 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సర్వస్వం దారపోసిన మాదిగ జాతి గత పదేళ్ళుగా కెసిఆర్ పాలనలో అన్ని రంగాలలో అణగారిపోయిందని, ఎన్నో ఆశలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలో అన్ని రంగాల పదవుల నియామకాల్లో జనాభా శాతానికి తగినట్టుగా అత్యంత ప్రాతినిథ్యం కల్పించి మాదిగలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజ్ఞాపూర్‌లోని హరిత హోటల్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా గోవిందు నరేష్ హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో మాదిగల శ్రమను, త్యాగాలను ఉపయోగించుకున్న కెసిఆర్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాదిగలను అన్ని రంగాల్లో అణిచివేసి అవమానపరిచాడని అన్నారు. కెసిఆర్ అహంకారంతో చేసిన తప్పిదాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేయవద్దని అన్నారు. ప్రజాస్వామిక స్ఫూర్తి, సామాజిక న్యాయ దృక్పథంతో పరిపాలన కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి సీనియర్ నాయకుడు మైస రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మని మహేష్, జిల్లా ప్రచార కార్యదర్శి కరుణాకర్, నాయకులు పొట్ట కరుణాకర్, రాజు, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దాం




సావిత్రిబాయిపూలే జయంతిలో పాల్గొన్న టిఎస్‌యుటిఎఫ్ నాయకులు

**నర్సాపూర్, జనవరి 5, ప్రభాతవార్త:** చదువుల తల్లి సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దామని టిఎస్‌యుటిఎప్ జిల్లా కార్యదర్శి శ్రీజ్యోతి అన్నారు. శుక్రవారం టిఎస్‌యుటిఎప్ ఆధ్వర్యంలో ఎల్లంకి డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయిపూలే 193వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీజ్యోతి మాట్లాడుతూ మహిళా సాధికారిత సాధించాలంటే విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రాషాహిన్, జయమ్మ, చంద్రమణి, సుహాసిని జబినా సుల్తానా, వసంతరాణి, రమాజ్యోతి, విజయశ్రీ, విజయలక్ష్మి, రవి, గంగాధర్, కెవిఆర్ నాయుడు, రమేశ్‌రాజు, అప్పలనాయుడు, వసురాం, భాస్కర్, శ్రీహరి, కళారాములు, రాంబాబు, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## శబరిమలకు బయలుదేరిన అయ్యప్పలు

**సదాశివపేట, జనవరి 5, ప్రభాతవార్త:** పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం శుక్రవారం అయ్యప్పస్వామి మాలధారుల పూజా కార్యక్రమాలతో సందడిగా మారింది. గురుస్వామి చింత గోపాల్ ఆధ్వర్యంలో ఆలయంలో అభిషేకం, పడిపూజాకార్యక్రమాలు భక్తి శ్రద్దలతో ఘనంగా కొనసాగాయి. సుధాకర్‌గౌడ్ గురుస్వామి, మొగులయ్య గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలాధారణ దీక్ష స్వాములకు ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇరుముడి కట్టుకున్న మాలాదారణ దీక్ష స్వాములు శబరిమలకు బయలుదేరారు. పూజలో అయ్యప్పస్వాములు, 500 మంది పాల్గొన్నారు.

## పట్టణంలో ప్రజా పాలన సభ




దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

**జహీరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** పట్టణంలోని మహీంద్రా కాలనీలో (31వ వార్డు)లో శుక్రవారం ప్రజా పాలన వార్డు సభను నిర్వహించారు. వార్డు ప్రజలు అందచేసిన ధరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి సుభాష్, ఇంజనీర్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు అనంత్ నవీన్ కుమార్, శుక్లవర్ధన్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, రవి ముదిరాజ్, సంగారెడ్డి, అనిల్‌కుమార్, కనకబరం, ప్రేమచందర్ తదితరులు పాల్గొన్నారు.

## మతిభ్రమించి మాట్లాడుతున్న కెటిఆర్

### -యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్



మాట్లాడుతున్న సర్దార్‌ఖాన్

**గజ్వేల్, జనవరి 5 (ప్రభాతవార్త):** రాచరిక పాలన సాగించి తెలంగాణకు యువరాజులా వ్యవహరించిన కెటిఆర్ అధికారం కోల్పోగానే మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ప్రజలు తగిన బుద్ధి చెప్పినా తన రాచరిక తత్వం ఇంకా కొనసాగిస్తూ నెల రోజుల పాలనపై పుస్తకం విడుదల చేయడం చూస్తే అర్థమవుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని బిఆర్ఎస్ నేతలు 35 రోజుల కాంగ్రెస్‌పాలనలో హామీల గురించి మాట్లాడడం చూస్తుంటే అధికార వ్యామోహం స్పష్టం కనబడుతుందన్నారు. ప్రశ్నిస్తే గొంతు నొక్కిన వాళ్ళు ఈరోజు మాట్లాడడం చూస్తుంటే జాలి వేస్తుందన్నారు. దళితున్ని ముఖ్యమంత్రి చేస్తామని, దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్ళు, ఇంటికో ఉద్యోగం, మైనార్టీలకు 12 శాతం రాజర్వేషన్ మొదలగు వాటిపై ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే రాబోయే ఎంపి ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని ప్రజలు భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో కిసాన్ సెల్ కార్యదర్శి అజ్గర్, యూత్ కాంగ్రెస్ నాయకులు కొడకండ్ల బాలు పాల్గొన్నారు.

## రామ నామస్మరణతో మార్మోగిన గ్రామాలు

**షాబాద్, జనవరి 5, ప్రభాతవార్త :** శ్రీరామజన్మభూమిలో భవ్యరామ మందిరం నిర్మాణం భారతదేశ ప్రజల చిరకాల కోరిక నెరవేరబో తుందని రుద్రారం, లక్ష్మారావుగూడ సర్పంచులు బండ స్వర్ణలత సతీష్ యాదవ్, అనితసత్తయ్య అన్నారు. శుక్రవారం మండల పరి ధిలోని రుద్రారం, లక్ష్మారావుగూడ గ్రామాల్లో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గ్రామంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా వా రు మాట్లాడుతూ.... జనవరి 22న బాలరాముని విగ్రహ ప్రతిష్ట సం దర్భంగా దేశంలో ప్రతి ఇంటికి అయోధ్య క్షేత్ర ట్రస్ట్ ద్వారా అక్షిం తలు పంపిణీ చేస్తున్నారన్నారు. జనవరి 15వరకు ఇంటింటికి అక్షిం తలు పంపిణీ చేస్తారన్నారు. అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట తర్వాత అక్షింతలు తలపై వేసుకోవాలని సూచించారు. ఈకార్యక్ర మంలో గ్రామస్థులు శ్రీనివాస్, అమృత్‌రెడ్డి, పాండురంగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చెన్నారెడ్డి, కృష్ణ తదితరులు ఉన్నారు.



అయోధ్య అక్షింతలను ఎవరెస్ట్ కాలనీలో వితరణ చేస్తున్న రామ భక్తులు

## ఎవరెస్ట్ కాలనీలో అయోధ్య అక్షింతల వితరణ

**సదాశివపేట, జనవరి 5, ప్రభాతవార్త:** పట్టణంలోని ఎవరెస్ట్ కాలనీలో గురువారం రాత్రికి ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య శ్రీరామాలయం నుంచి రామతీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణానికి సరఫరా అయిన అయోధ్య అక్షింతలను ప్రజలకు శ్రీరామ నామాన్ని స్మరిస్తూ వితరణచేశారు. ఇంట్లోకి అక్షింతలతో చేరుకున్న శ్రీరామ భక్తులకు మంగళహారతిలతో ఘనంగా స్వాగతం పలకగా భక్తులు ఇంట్లోని వారికి అక్షింతలు, శ్రీరామాలయ చిత్ర పటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో శ్రీరామ మందిరం కమిటీ సభ్యులు కోసమేశ్వర్, పటేల్ ప్రభు, శివారెడ్డి, నిరంజన్, రామ్‌రెడ్డి, మల్లన్న. కాలనీ వాసులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**రాయిపల్లిలో...**



రాయిపల్లిలో అయోధ్య అక్షింతలను వితరణ చేస్తున్న బిచ్కుంద ఆశ్రమ పీఠాధిపతి సోమయప్ప

**మనూర్, జనవరి 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాయిపల్లిలో శుక్రవారం అయోధ్య అక్షింతలను బిచ్కుంద ఆశ్రమపీఠాధిపతి సోమయప్ప ఆధ్వర్యంలో గ్రామస్థులకు వితరణ చేశారు.గ్రామంలోని పురవీధుల గుండా భజనలు చేస్తూ ఊరేగింపుగా చేరుకుని ప్రజలకు అక్షింతలను అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 10లో ఉత్తమ ఫలితాలకు శ్రమిద్దాం : ఎంఇవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ మారుతి

**న్యాల్‌కల్, జనవరి 5, ప్రభాతవార్త:** రానున్న 10వ తరగతి వార్షిక ఫలితాల్లో విద్యార్థులు మంచి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు శ్రమించాల్సిన అవసరం ఉందని ఎంఈఓ మారుతి పేర్కొన్నారు. శుక్రవారం మిర్జాపూర్(బి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మారుతి మాట్లాడుతూ విద్యా ప్రమాణాల మెరుగకు ప్రతి ఒక్క ఉపాధ్యాయులు కృషి చేయాలని, అందుకు పోషకులు సైతం ఉపాధ్యాయులకు తమ వంతు సహకారం అందిచాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయ కమిటీ



ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ కార్యవర్గం

**సదాశివపేట, జనవరి 5, ప్రభాతవార్త:** పట్టణంలోని బట్టల బజార్ సుభాష్ రోడ్డులో గల ఆంజనేయస్వామి దేవాలయం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటి అధ్యక్షులుఏగా బరాడి శివ, ప్రధాన కార్యదర్శిగా బారాది బాలరాజు, కోశాధికారిగా వేముల వెంకటేశం, ఉపాధ్యక్షులుగా విశ్వనాథరావు, సహకార్యదర్శిగా దుబులగొండి రవి, కార్యవర్గ సభ్యులుగా నాగేష్, సత్యనారాయణ, రామచంద్రయ్య, ప్రవీణ్, నాగరాజు, చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షులు బరాడి శివ పేర్కొన్నారు. నూతన కమిటి కార్యవర్గ సభ్యులతో ఆలయ అర్చకులు జంగం మహేష్‌స్వామి ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అభివృద్దే లక్ష్యంగా సేవలు అందిస్తామని అధ్యక్షులతో పాటు కమిటీ బాధ్యులు హామి చేశారతు.

## బడిలో చేరిన బడిబయట విద్యార్థి



బడికి బయట ఉన్న విద్యార్థిని పాఠశాలలో చేర్చుకుటున్న హెచ్ఎం

**పాపన్నపేట, జనవరి 5, ప్రభాతవార్త:** బడికి దూరంగా ఉన్న బడిఈడు విద్యార్థిని శుక్రవారం పాఠశాలలో విద్యను ఆర్జించేందుకు అడ్మిషన్ చేర్పించారు. మండలపరిధిలోని బాచారంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బడికి దూరంగా ఉన్న 13 సంవత్సరాల బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు విద్యపై అవగాహన కల్పించి పాపన్నపేటలోని ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఉపాధ్యాయులు వీరేశం, సిఆర్‌పిలు రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి5 ప్రభాతవార్త:** మెదక్ ఎమ్మెల్యేగా ఎన్నికైన మైనంపల్లి రోహిత్‌ను శుక్రవారం మెదక్ కోర్టులో బార్ అసోసియేషన్ తరపున ఘనంగా సత్కరించారు. ఈ ఆత్మీయ సత్కార కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు జెన్నారెడ్డి, సెక్రటరీ శ్రీపతిరావు, అడ్వకేట్ హౌజింగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ లక్ష్మణ్ కుమార్, శోభన్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, పోచయ్య, జీవన్‌రావు, పవన్ శ్రీకర్‌రావు, బాలయ్య, సుభాష్‌గౌడ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను మర్యాదపూర్వకంగా ఆహ్వానించడమే కాకుండా న్యాయవాదులతో కలిసి భోజనం చేశారు. అనంతరం రోహిత్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని, న్యాయవాదులకు పెండింగ్‌లో ఉన్న హౌజ్ సైట్ ప్లాట్‌లను అందజేసేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి న్యాయవాదుల సమస్యల కృషి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అదేవిధంగా జూనియర్ న్యాయవాదులకు వెల్ఫేర్ నుండి రావాల్సిన గౌరవ వేతనంపై కూడా సమీక్షా సమావేశంలో చర్చించడంతో పాటు సీనియర్ న్యాయవాదులకు గౌరవ వేతనం 5 వేల రూపాయలతో పాటు, 5 లక్షల రూపాయల ప్రమాద భీమాను వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సంజీవ్‌రెడ్డి, దామోదర్, లల్లూ, ప్రశాంత్‌లతో పాటు పలువురు న్యాయవాదులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సదాశివపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆకుల శివ



చౌటకూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం



శివ్వంపేటలో దరఖాస్తులను స్వీకరిస్తున్న దృశ్యం



అమీన్‌పూర్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న సుధ



అమీన్‌పూర్‌లో మున్సిపల్ చైర్మన్...



ఏస్గిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత అబ్దుల్ రహీమ్



శేఖాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

# ఆరు గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**నారాయణఖేడ్, జనవరి 5 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్, మద్వార్, మద్వార్ తండా, తదితర గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి సోనియమ్మ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, కాంగ్రెస్ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

**పెద్దశంకరంపేట మండలంలో...**

**పెద్దశంకరంపేట, జనవరి 5 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందిస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలో నిర్వహించిన ప్రజాపాలన అభయహస్తం ఆరుగ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచి అలుగుల సత్యనారాయణ, ఎంపీటీసీ వీణ సుభాష్‌గౌడ్, ఉపసర్పంచి దశరథ్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్, నాయకులు సురేందర్‌రెడ్డి, ఆర్యన్ సంతోష్‌కుమార్, రాజేందర్‌గౌడ్, జనార్ధన్, దాచా సంగమేశ్వర్, పండరి, రంగారెడ్డి పాల్గొన్నారు.

**20వ వార్డులో ప్రజా పాలన**

**సదాశివపేట, జనవరి 5, ప్రభాతవార్త:** పట్టణంలోని 20వ వార్డులో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని కౌన్సిలర్ ఆకుల శివ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలు అందచేసిన దరఖాస్తులను శివ స్వీకరించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ జనవరి 6వ తేదీవరకు ప్రజలు దరఖాస్తు లను అందచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

**చౌటకూరులో...**

**చౌటకూరు, జనవరి 5, ప్రభాతవార్త:** శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో కాంగ్రెస్ నేత సుభాష్‌రెడ్డి పాల్గొని ప్రజలు నుంచి ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరమణిమొగులయ్య, ఎంపిటిసిసభ్యులు సరిత భూపాల్ రెడ్డి, నాయకులు మైపాల్‌రెడ్డి, వర్కల రమేష్, రామాగౌడ్, రజకసంఘం అధ్యక్షులు నాగమయ్య పాల్గొన్నారు.

**బొమ్మారెడ్డి గూడెంలో ప్రజా పాలన...**

మండలంలోని బొమ్మారెడ్డిగూడెంలో శుక్రవారం ప్రజా పాలన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు అందచేసిన దరఖాస్తులను తహసీల్దార్ ఈశ్వర్‌రాణి స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మమతారఘు నాయక్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చేసిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలుచేసి పేదల సంక్షేమానికి పాటుపడతారన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ శ్రీకాంత్‌గౌడ్, ఏఈఓ చైతన్య, ఎస్టీసెల్ అధ్యక్షులు, గ్రామస్థులు, పంచాయితీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

**కొత్తపేట గ్రామంలో...**

**శివ్వంపేట, జనవరి 5 ప్రభాతవార్త:** శుక్రవారం కొత్తపేట గ్రామంలో సర్పంచి సాన్వీ రమాకాంత్‌రెడ్డి అధ్యక్షతన తహశీల్దార్ శ్రీనివాసచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో వైస్ఎంపీపీ ఆర్.రమాకాంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటికీ అభయహస్తం దరఖాస్తుఫారాలను అందజేయడం జరిగిందని, లబ్ధిదారులకు కావాల్సిన ప్రతి అంశంలో ప్రభుత్వం నుండి సాయం అందించాలని టిక్ మార్క్ చేయాలన్నారు. ప్రజా పాలన కార్యక్రమం ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ షఫీయోద్దీన్, మాజీ సర్పంచులు శ్రీరామ్‌రెడ్డి, పనసారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొడకంచి సుదర్శన్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు సార శేఖర్‌గౌడ్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కిషన్, నాయకులు సార శివరామగౌడ్, సోమన్నగారి పాండరి గౌడ్, నల్ల పోచాగౌడ్, పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్, అంగన్వాడీ టీచర్ వాణి, ఆశావర్కర్ మంజుల, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

**అమీన్‌పూర్‌లో...**

**అమీన్‌పూర్, జనవరి5 ప్రభాతవార్త:** ప్రజాపాలనతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు, అమీన్‌పూర్ కౌన్సిలర్ కాట సుధాశ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శుక్రవారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 19వవార్డు ఎన్ఎస్ఎల్ కాలనీలో ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో కాట సుధా శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపాలనలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో...**

**అమీన్‌పూర్, జనవరి5 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 18, 19, 24వ వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా వివిధ సంక్షేమ పథకాల కోసం ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు యూసుఫ్, సదువు మల్లేష్, పద్మావతి, కోఆప్షన్ సభ్యులు తలారి రాములు, యూనుస్, బిఆర్ఎస్ నాయకులు దాస్‌యాదవ్, కొల్లూరు యాదగిరి, జనార్ధన్‌రెడ్డి, మల్లేష్, భాస్కర్ రెడ్డి, లక్ష్మీకాంత్, శ్రీనివాస్, కృష్ణవేణి, పాండురంగారావు, ప్రసాద్‌రావు, గోపి, చిత్తారెడ్డి, గోపాల్, లక్ష్మారెడ్డి, కళ్యాణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**ఏస్గి గ్రామంలో...**

**నాగల్‌గిద్ద, జనవరి 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఏస్గి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నేత అబ్దుల్‌రహీమ్ పాల్గొని ప్రజలకు, అధికారులకు పలుసూచనలు చేశారు. ప్రజలు విధిగా ధరఖాస్తులు అందచేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి అనిల్‌కుమార్,కాంగ్రెస్ నియోజకవర్గ, మండల నాయకులు వై.పండరి, జట్టే సంజీవులు, గణపతిరావు పాటిల్, నర్సింగ్‌రావు పాటిల్, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు సంజీవ్, సురేఖ, అంగన్‌వాడి కార్యకర్తలు, వైద్యసిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

**శేఖాపూర్‌లో...**

**జహీరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** మండంలోని శేఖాపూర్, శేఖాపూర్ తండాలలో శుక్రవారం ప్రజాపాలన నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, వైస్ఎంపిపి రాములు, మండల ఉపాధ్యక్షుడు పి.నాగిశెట్టి, అక్బర్‌హుస్సేన్, ఇమాం పటేల్, ఎంపిటిసిసభ్యులు నర్సింలు, కుర్షిద్‌బాయి, శ్రీను బానోత్, శుభాష్, అధికారులు పాల్గొన్నారు.

## బోధన సామర్థ్యాల మెరుగకు కాంప్లెక్స్ సమావేశాలు : ఎంఈవో



మాట్లాడుతున్న ఎంఈఓ అంజయ్య

**పుల్కల్, జనవరి 5, ప్రభాతవార్త:** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మండల స్థాయి ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశినికి ముఖ్య అతిథిగా ఎంఈఓ డి.అంజయ్య బోధన మెరుగ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. లెసన్స్ ప్లాన్, బెస్ట్ ప్రాక్టీస్ పాఠశాల బోధన సమస్యలపై సమావేశంలో చర్చించినట్లు ఎంఈఓ అంజయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సంగప్ప, ఆర్‌పిఉ మల్లేశం, ప్రసాద్, పిఆర్‌పిలు ప్రభాకర్, మల్లేశం పాల్గొన్నారు.

## క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పూజలు



**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 5, ప్రభాతవార్త:** పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైకుంఠపురం ప్రధాన అర్చకులు వరదాచారులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు ఆశీర్వచనాలు చేసి శాలువాతో సన్మానించి ఆలయ జ్ఞాపికను ఎమ్మెల్యేకు అందచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.



అయోధ్య రామయ్య అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం

## భక్తుల చెంతకు అయోధ్య రామయ్య అక్షింతలు

**కొల్చారం, జనవరి 5 ప్రభాతవార్త:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరం నుంచి కొల్చారం మండల పరిధిలోని దేవునివెంకటాపూర్ గ్రామానికి సరఫరా అయిన అయోధ్య అక్షింతలను శుక్రవారం దేవుని వెంకటాపూర్ గ్రామంలో సర్పంచి నెల్లి కిష్టయ్య, హిందూ సంఘాల నేతలు, శ్రీరాముని భక్త బృందం ఆధ్వర్యంలో వెంకటేశ్వర ఆలయంలో అయోధ్య అక్షింతలను ఉంచి ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుండి గ్రామంలోని పురవీధుల గుండా రామ నామ స్మరణ చేస్తూ భక్తి శ్రద్ధల మధ్య ఊరేగించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి గ్రామంలోని పురవీధులు కూడా జైశ్రీరాం నామ స్మరణతో మంగళ వాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించి అయోధ్య రామయ్య అక్షింతలు ప్రతి ఇంటికి వెళ్లి గడపగడపకు పంపిణీ చేశారు.

## అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు

**కొల్చారం, జనవరి 5 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుక్కాపూర్, రంగంపేట గ్రామాల్లో శుక్రవారం అయోధ్య రామ మందిరం నుండి వచ్చిన పవిత్రమైన పూజిత అక్షింతలను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా భజన భక్తి పాటలతో శ్రీరాముని నినాదాలతో గ్రామాల్లోని ప్రతి ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు శైలం, ఆంజనేయులు, సతీష్, రవీందర్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అయోధ్య రామయ్య అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం



సరోజనమ్మగుట్ట జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## పర్యాటక కేంద్రంగా సరోజనమ్మ గుట్ట : ఎమ్మెల్యే

**రామచంద్రాపురం, జనవరి 5, ప్రబాతవార్త:** తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమల సరోజనమ్మ గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడినఅన్నారు. శుక్రవారం సరోజనమ్మగుట్ట జాతరలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గుట్ట అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు.గుట్టపై భక్తులకు వసతి సౌకర్యాలు, ఆలయ ప్రాంగణం విస్తరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయం వరకు ఇప్పటికే సిసి రోడ్డును నిర్మించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఐర్మన్ మల్లెపల్ల లలిత సోమిరెడ్డి, కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, ఒగ్గు సుచరిత కొమురయ్య, బిఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, వార్డు కమిటి అధ్యక్షులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే



ఎస్టీటీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి5 ప్రభాతవార్త:** ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్టీటీయూ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, రామాయంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా నరేందర్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, జిల్లాలోని మండలాల బాధ్యులు సురేష్, సత్యం, రామకృష్ణ, రమేష్, రేణుక, శ్రావణి, రాణిలతో పాటు మరికొంత మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**మనూర్, జనవరి 5, ప్రభాతవార్త:** మండలంలోని బాదల్‌గావ్ గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవ, ఎన్‌టిటి డాటా ఆధ్వర్యంలో శుక్రవారం నోటు పుస్తకాలు, బ్యాగులు, జామెంట్రీ బాక్స్‌లు, విద్యా సామాగ్రిలను పంపిణి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్, ఉపాధ్యాయులు సంగారెడ్డి, నారాయణ, సాఫ్ట్‌వేర సంస్థ డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి

## మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

**అమీన్‌పూర్, జనవరి 5 ప్రభాతవార్త:**

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి అధికారులకు సూచించారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అధ్యక్షతన కమిషనర్ జ్యోతిరెడ్డి ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మున్సిపల్‌లోని వివిధ అభివృద్ధి పనులకు మున్సిపల్ సాధారణ నిధుల నుండి 2 కోట్లు 98 లక్షల రూపాయల మౌలిక సదుపాయాల నిర్వహణ పనులు చేపట్టటానికి వైస్‌చైర్మన్ నందారం నరసింహగౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు ఆమోదం తెలిపారు. వార్డుల్లో ఉన్న రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి సరఫరా పైప్‌లైన్‌లో సమస్యలను పరిష్కరించాలని కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ చైర్మన్‌ను కోరారు. దీనికి మున్సిపల్ చైర్మన్ స్పందించి అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యతలతో తనతోపాటు కౌన్సిల్ బాధ్యతగా తమ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కౌన్సిల్ సభ్యులను మున్సిపల్ చైర్మన్ కోరారు. ఈ సమావేశంలో మేనేజర్ మోహన్, మున్సిపల్ ఏఈ ప్రవీణ్, ఆర్‌వోఈ వెంకట రామయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అంజన్‌కుమార్, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారి శంకర్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పాండురంగారెడ్డి